# 7. హాస్యగాడు అబునువాస్

పూర్వపు వాళ్ళలోను, ఇప్పటి వాళ్ళలోను మనం జ్ఞాపక ముంచుకో తగిన ఉపాయశాలులందరిలో గొప్ప వాడెవడో చెప్ప గలరా? కొందరు ఒకడు గొప్పవాడు అంటే, మరికొందరు ఇంకొకడు మరీ గొప్పవాడంటారు. కాని, నిజం తెలిసిన వాళ్లంతా అబునువాస్ పేరే చెబుతారు. అబునువాస్ జీవితమంతా హాస్య కథలుగా, తమాషాపనులతో, మంచి మంచి ఉపాయాలతో, నవ్వుల మాటలతో గడచిపోయింది. అంతే కాదు, ఎన్నో సార్లు తన యుక్తితో హాస్యంతో ఎన్నో చిక్కుల్లోంచి బయటపడ్డాడు. ఆయన ఎవ్వరినైనాసరే నవ్వించాలనుకున్నాడా, తమాషా మాటల్తో కడుపుబ్బేట్టు నవ్వించేవాడు. ఎంత తెలివి గలవాడినైనా చాదస్తు డనిపించాలంటే ఏదో యుక్తి పన్ని బోల్తా కొట్టించేశేవాడు. మామూలు మనుష్యుల్నేకాదు, మహారాజుల్ని కూడా లెక్క లేకుండా హాస్యమాడేవాడు.

ఈ అబునువాస్‌కి ఒక గాడిద ఉండేది. ఆ గాడిదకి నీళ్ల పెట్టటానికి ఒక పెద్ద పళ్ళెం కావలసివచ్చింది. పొరుగింటికి వెళ్లి అడిగాడు. "మీ పళ్ళెం ఓసారి ఎరువిచ్చారంటే, మా గాడిదకు నీళ్లు పెట్టు కుంటాను," అన్నాడు. అబునువాస్ అంతవాడు స్వయంగా వచ్చి అడిగాడుగదా అని వాళ్లుమంచి రాగిపళ్ళెం తెచ్చి ఇచ్చారు. దాన్ని ఇంటికి తీసుకుపోయి మూడు

రోజు ఉంచుకున్నాడు. నాలుగో రోజున, ఆ రాగిపళ్లెంలో, ఇంకోచిన్న పళ్ళెంకూడా పెట్టి రెండూ కలిపి ఎరువుతెచ్చిన వారికి ఇవ్వటానికి తీసుకువెళ్లాడు.

"ఇదిగో తీసుకోండి మీ రాగి పళ్లెం," అని ఇచ్చాడు అబునువాస్. పక్కయింటి పెద్దమనిషి పళ్ళెం తీసుకోగానే, అందులో ఇంకో చిన్నపళ్లెం ఉండటం చూశాడు. "అయ్యో; ఈ రాగిపళ్లెంలో ఉన్న చిన్న పళ్లెం మాదికాదే!" అన్నాడు.

"నేను దొంగని కానండోయ్! మీ రిచ్చిందేదో మీకు తెచ్చి ఇచ్చాను. మీ రాగి పళ్లెం నా దగ్గర ఉన్నపుడు, దానికి ఈ చిన్న పళ్లెం పుట్టింది. ఈ చిన్న పళ్ళెం మీ పెద్ద పళ్లెం బిడ్డ కాబట్టి, ఇవి రెండూ మీవే," అన్నాడు అబునువాస్. అబునువాస్ తెలివితక్కువ తనానికి నవ్వుకుని, పోనీ ఇంకో చిన్న పళ్లెం కూడా వస్తూంటే పోనివ్వట మెందుకని, "ఒహో! మీరు చెప్పింది నిజమే, ఈ చిన్ని పళ్లెం మాపళ్లెం కన్నబిడ్డ కాబట్టి రెండూ, మాకే రావాలి. మీ ఇల్లు ఎంత మంచిదండీ! పళ్లాలకు కూడా బిడ్డలు పుట్టే చల్లనియిల్లు!" అన్నాడు పొరుగింటాయన.

మూడు రోజులు పోయాక, అబునువాస్ మళ్ళీ వాళ్లింటికి వెళ్లి ఆ పళ్లెమే ఇంకోసారి ఎరువడిగాడు. ఈ సారి మళ్ళీ ఇంకో మంచి బిడ్డను తీసుకొస్తుందనే సంతోషంతో, వెంటనే ఆ యింటి యజమాని పళ్లెం తెచ్చి ఇచ్చాడు.

అబునువాస్ నవ్వుకుంటూ ఆయనకి నమస్కారం పెట్టి రాగి పళ్ళెం చంక బెట్టుకొని ఇంటికి పోయాడు. ఈ సారి పళ్ళెం తీసుకుపోయి ఎన్నాళ్లైనా తిరిగి ఇవ్వలేదు. పొరిగింటాయన వచ్చి పళ్లెం కావాలని అడిగాడు. అబునువాస్ ఎంతో విచారంగా, "ఏమిచేయమంటారు బాబూ? మీకు పుట్టెడు దుఃఖవార్త

చెప్పాల్సివచ్చింది. మీ పళ్లెం చచ్చిపోయింది బాబు!" అని చెప్పాడు.

"బాగుందయ్యో! పళ్లెం చచ్చిపోవట మేమిటి?" అన్నాడు పొరుగింటి మనిషి.

"మీ కెంతో కష్టం వచ్చింది పాపం! ఈ విషయం మీకు చాలా దుఃఖం కలుగజేస్తుందనే నేను మీకు ఇన్నాళ్ళూ చెప్పలేదు. ఏం చెయ్యను? చివరికి చెప్పక తప్పలేదు!" అన్నాడు అబునువాస్. ఇది వినగానే పొరుగింటి పెద్దమనిషికి తగనికోపం వచ్చింది.

"అబునువాస్! నీ ఉద్దేశమేమిటి? నేనేం పిచ్చివాణ్ణనుకున్నావా? రాగిపళ్ళెం చావటం ఎప్పుడన్నా, ఎక్కడన్నా విన్నావా?" అన్నాడు.

"ఈ రాగిపళ్లెమే వెనుక బిడ్డను కన్నది కదండీ," అన్నాడు అబునువాస్.

"అవును అదే," అన్నాడు పొరిగింటాయన, తను ఆ చిన్నపళ్లెం గప్‌చిప్‌గా తీసుకొన్న సంగతి జ్ఞాపకం తెచ్చుకుంటూ.

ఈ సృష్టిలో బిడ్డల్ని కనేవన్నీ ఏనాడో ఒకనాడు చచ్చిపోక మానవు బాబూ? ఎటొచ్చీ మీ రాగిపళ్ళెం పాపం పరాయియింట్లో చచ్చిపోవటమే చాలా విచారకరమైన సంగతి! ఏం చేస్తాం. దానికి అలా రాసిపెట్టి ఉంది," అని ఓదార్చాడు.

అబునువాస్ రాగిపళ్లెం ఇంట్లోనే ఉంచేసుకున్నాడు. ఆ పొరుగింటాయన పోయి జరిగిన సంగతంతా ఎవరితో చెప్పినా అబునువాస్ చెప్పింది న్యాయమే అన్నారు. "బిడ్డలను కనే ప్రతి జీవం విధిగా చావాల్సిందే," అన్నారు.

ఇంకోసారి ఒకడు అబునువాస్ దగ్గిరికి వెళ్ళి వాళ్ల గాడిదను ఎరువు అడిగాడు.

"అయ్యో! ఏం చెయ్యనయ్యా! మాగాడిద ఇవ్వాళే పనిమీద ఊరికి వెళ్ళిపోయిందే!" అని అబునువాస్ చెప్పాడు. ఇలా అంటూ ఉండగానే ఇంటి పెరటిలో మేస్తున్న గాడిద గట్టిగా ఓండ్రపెట్టింది.

"అదిగో మీదొడ్లో గాడిద అరుస్తూంటే ఇంట్లో లేదంటా వేమన్న పెద్దమనిషివయ్యా?" అన్నాడు.

"ఇదిగో, ఇట్లాచూడు! నీకు కావలసింది మా గాడిదా? గాడిద అరుపా? గాడిద ఇక్కడలేదు. గాడిద అరుపు కావాలంటే తీసుకుపో," అని చెప్పి, అబునువాస్ గాడిదలాగా "ఈ-ఓర్-ఈ-ఓర్" అని గట్టిగా అరిచాడు. "ఇదిగోనయ్యా! గాడిదఅరుపు, దానిమీద త్వరగా ఎక్కి నీదారిని నువ్వుపో," అని తెల్లబోయిచూస్తూన్న ఆపెద్దమనిషితో చెప్పాడు.

ఇంకొకసారి ఇంకా మంచి తమాషా జరిగింది. అబునువాస్ రెండస్తుల మేడ కట్టాడు. అంతా కట్టిన తరువాత ఆ మేడ అమ్మాలని బేరం పెట్టాడు. అంత పెద్దమేడ ఎవరికీ అవసరం లేకపోయింది. అడిగినవాళ్లే లేకపోయారు. చివర కెట్లాగో అబునువాస్ తన మేడ మీదిఅంతస్తు మాత్రం ఒక వ్యాపారస్థుడికి అమ్మగలిగాడు. వర్తకుడు మేడమీద ప్రవేశించాక, క్రింది భాగం కూడా కొనమని కొన్నినెలలుగా అబునువాస్ ఆయన్ని అడుగుతూ వచ్చాడు. అయితే వ్యాపారస్థుడు తనకు అక్కర్లేదని చెప్పేశాడు.

ఒకనాటి ఉదయం అబునువాస్ చాలామంది కూలీలను పిలిపించి, తన ఇంటి గోడలు పగులగొట్టమన్నాడు. పైనున్న

వర్తకుడు ఈ గడబిడి ఏమిటా అని కిటికీలోంచి క్రిందికి తొంగి చూశాడు. అంతమంది కూలీలు అబునువాస్ చెప్పిన ప్రకారం ఆ మేడగోడలన్నీ గడ్డపారలతో తవ్వుతూండటం చూశాడు. కంగారు పడుతూ, "ఏం చేస్తున్నారు అక్కడ?" అని అరిచాడు.

"మా ఇంటి క్రింది అంతస్తు అమ్ముతానంటే ఎవరూ కొనలేదు. అందుచేత పగలగొట్టించి పారేస్తున్నాను. నీ పై అంతస్తు సంగతి నువ్వు జాగ్రత్తగా చూసుకో. నీ మేడ విరిగి నా కూలీల మీదపడి వాళ్లకి దెబ్బలు తగిల్తే మాత్రం నే నూరు కోను," అన్నాడు అబునువాస్.

"వద్దుబాబూ! ఊరుకోండి. నేనే మీ ఇంటి క్రింది అంతస్తు కూడా కొంటాను; తప్పకుండా కొంటాను; పగలగొట్టించ కండి," అంటూ ఆ వర్తకుడు తన పై అంతస్తు కోసం విధి లేక క్రింది అంతస్తు కూడా కొన్నాడు. అప్పుడు గాని, అబును వాస్ నవ్వుకుంటూ, తన పనివాళ్లని అవతలకు పంపలేదు.

ఆఖరికి ఆ ఊరి రాజుకూడా అబునువాస్ హాస్యపుదెబ్బ నుంచి తప్పించుకో లేకపోయాడు. ఒకనాటి రాత్రి రాజుకి ఒక కల వచ్చింది. అబునువాస్ ఇంటి కింద వెండి నాణాలతో నిండిన బిందెలు పూడ్చి ఉన్నట్టు రాజుకి కలలో కనబడింది. మరునాడే రాజు అబునువాస్ ఇంటికి తక్షణం ఆ బిందెలు తవ్వకు రమ్మని పదిమంది పనివాళ్ళని పంపాడు. అబునువాస్ ఇంట్లో లేడు. అతని భార్య, ఈ పనివాళ్లు వచ్చి గోడలక్రింద నేల తవ్వేస్తూంటే ఏమీచేయలేక దూరంగా నిలబడి ఏడుస్తూంది. చివరకు ఎంత పెళ్ళగించి చూచినా వెండిబిందెలు కనబడలేదు. రాజుగారి కూలీలు వెనక్కి తిరిగి వెళ్ళిపోయారు. అబునువాస్ ఇంటికి రాగానే ఇంటినిండా వాళ్లు తవ్విన గోతులు, గోడలనిండా సొరంగాలు

చూశాడు. భార్య ఏడుస్తూ సంగతంతా చెప్పింది. అబునువాస్ భార్యని ఓదార్చి, "మరేమీ ఫరవాలేదులే. రాజుగారికి తగిన శాస్తి నే చేస్తాగా. నువ్వు దిగులు పడకు," అన్నాడు.

ఒక కుండ నిండా అన్నం వండమన్నాడు భార్యని. అన్నం వండాక, కొంత అన్నం తీసి ఒక పళ్లెంలో వేసుకుని దాని మీద ఒక తువాలు కప్పాడు. తువాలు మీద చాలా ఈగలు వాలాయి. అందులో కొన్ని లోపలికి దూరి, అన్నం తినటానికి ప్రయత్నిస్తున్నాయి. మరునాడు తెల్లవారగానే తువాలా కప్పిన అన్నపు పళ్లాన్ని రాజుగారికోటకు తీసుకెళ్లాడు.

"ప్రభూ ! నా దొక ఫిర్యాదు ఉంది. కొందరు నా ఇంటికి పిలవకుండానే వచ్చి, నా ఆహారాన్ని తినేస్తున్నారు. వాళ్ళని దండించకుండా ఎట్లా ఊరుకో మంటరో మీరే చెప్పండి!" అని రాజుగారిని అడిగాడు.

రాజు అబునువాస్ ఏదో కట్టుకథ లాంటిది చెపుతున్నాడేమో అనుకున్నాడు. తన పనివాళ్ళు వెళ్ళి అతని ఇంట్లో నేలను పెళ్ళగించిన విషయం చెపుతున్నాడేమోనని కూడా రాజుకి అనుమానం కలిగింది.

"ఇంతకీ నువ్వు ఫిర్యాదు చేస్తున్నది ఎవరిమీద?" అని రాజుగారు అడిగారు. అబునువాస్ తను తెచ్చిన అన్నపు పళ్లెం మీద కప్పిన తువ్వాలు తీశాడు. వెంటనే మూడు ఈగలు ఎగిరి పోయాయి. "వీటి మీదే నా ఫిర్యాదు," అన్నాడు అబునువాస్.

ఈ మాటలు వినగానే రాజుకి నవ్వువచ్చింది. "ఈగలమీదా నీ ఫిర్యాదు? సరే ! నన్ను ఏంచేయమంటావో చెప్పు," అన్నాడు.

"నాకు చట్టంప్రకారం న్యాయం చెయ్యమంటున్నాను. ఈగల్ని దండించటానికి మీరు నాకు అనుమతి ఇవ్వాలి. అంతే ప్రభూ !" అన్నాడు అబునువాస్.

"భేష్ ! బాగానే ఉంది. ఈగలను దండించటానికి నీకు అనుమతి ఇచ్చాను. ఈగలు ఎక్కడ కనుపించినా నీ యిష్టం వచ్చినట్టు దండించు," అన్నాడు రాజు నవ్వుతూ.

రాజుగారు ఈ తీర్పుని ఒక కాగితంమీద కూడా వ్రాసి, సంతకంచేసి అబునువాస్‌కి ఇచ్చాడు. అబునువాస్ ఈగలను దండించటానికి పెద్ద దుడ్డుకఱ్ఱ చేయించాడు. ఆ కఱ్ఱ చివర గట్టి ఇనుప పొన్ను కూడా వేయించాడు. ఎక్కడికి వెడితే అక్కడ ఈగ కంటబడితే చాలు, ఆ కఱ్ఱతో కొట్టేసేవాడు. బజారుకు వెళ్ళినప్పుడు అక్కడ ఖర్జూరపు పళ్ల బుట్టల మీద ఈగలు వాలటం చూసి, దుడ్డుకర్ర విసిరేవాడు. దాంతో ఖర్జూరపు పళ్లన్నీ చిందరవందరగా పడిపోయేవి. పళ్ళ దుకాణంలో ఈగలు కంటబడితే, పళ్ళన్నీ చితికిపోయేటట్టు కర్రతో బాదేవాడు. అంగడి వాళ్లు, "ఎందుకయ్యా ఇట్లాచేస్తున్నావు?" అని గదమాయించి అడిగితే, "నేనేమీ మీ పళ్ళని కొట్టటం లేదయ్యా! వాటిమీద వాలిన ఈగల్నే దండిస్తున్నాను," అని జవాబు చెప్పి, రాజుగారు ముద్రవేసి యిచ్చిన అనుమతి పత్రాన్ని చూపించేవాడు. వాళ్లు "ఇదేం మేళంరా! ఈయన మనపని పట్టించాడేమిటి?" అనుకుంటూ ఊరుకునేవాళ్లు. ఇట్లా కొన్ని రోజులు గడిచాయి. అబునువాస్ వెఱ్ఱి చేష్టలకి విసుక్కునేవాళ్లు విసుక్కుంటున్నారు. నవ్వుకునేవాళ్ళు నవ్వుకుంటున్నారు. రాజుగారుకూడా ఈ వింత చేష్టలన్నీ విని విరగబడి నవ్వాడు.

చివరకు ఒకనాడు, రాజుగారు తన మందిరంముందు రాజ సభలో తీర్పులు చెపుతున్నాడు. అబునువాస్ కూడా వెళ్లి రాజు

గారి దగ్గరగా కూచున్నాడు. రాజుగారు ఏదో నేరాన్ని విచారణ చేసి తీర్పుచెపుతున్నాడు. ఆయన చాలా గంభీరంగా మాట్లాడుతుండగా, రాజుగారి వీపుమీద ఈగ వాలింది. అబునువాస్ చటక్కున తన దుడ్డుకర్ర పైకెత్తి రాజుగారి వీపుమీద గట్టిగా బాదాడు.

వెంటనే రాజసభలో అంతా గొల్లుమన్నారు. అందరూ అబునువాస్‌ను చుట్టుముట్టి రాజుగారిని కొట్టినందుకు అతనిని శిక్షించాలని గట్టిగా పట్టుకున్నారు.

"అబునువాస్! ఏమిటీ పిచ్చి! ఎంతపనిచేశావు ? రాజుగారిని కొడతావా?" అని అధికార్లు అబునువాస్‌మీద మండిపడ్డారు. అబునువాస్ జంకు కొంకు లేకుండా "నేను తప్పేం చెయ్యలేదే! నన్ను మీరు శిక్షించడం న్యాయంకాదు. నేను రాజుగారి వీపుమీద వాలిన ఈగను కొట్టానుగాని, రాజుగారిని కొట్టలేదు. రాజుగారే ఈగల్ని చంపటానికి నాకు అనుమతి ఇచ్చారు," అని చెప్పాడు. రాజుగారు స్వయంగా సంతకంచేసి యిచ్చిన అనుమతి పత్రం జేబులోంచి తీసి అందరికి చూపించాడు. ఇంకేం మాట్లాడతారు? అతను చెప్పిందంతా నిజమే. అతనిని నిర్దోషిగా వదలక తప్పింది కాదు.

"వెధవ ఈగలకి తగిన శాస్తి జరిగింది. అవి నా ఇంట్లో ప్రవేశించి నా సొమ్ము దౌర్జన్యంగా తీసుకోటానికి ఎందుకు ప్రయత్నించాలి?" అన్నాడు అబునువాస్.

మరోసారి ఇంకో విచిత్రమైన సంగతి జరిగింది. పట్నంలో ఒక భాగ్యవంతుడైన వర్తకుడు మేకమాంసం వండించి మంచి విందు తయారు చేయిస్తున్నాడు, విందు భోజనం వండేటప్పుడు, ఒక బిచ్చగాడు అక్కడ ఏమి జరుగు

తూందో చూద్దామని వచ్చాడు. పాపం! వాడు కాస్త దూరంగా, వంటలు తయారుచేసే చోటినించి వచ్చేగాలికి ఎదురుగా కూచు న్నాడు. గాలివాలుగా కూచోబట్టి, మంచి కమ్మని-వాసన కొడు తూంటే ఘుమ ఘుమలాడే ఆ కమ్మనిగాలి పీల్చుకుంటూ, ఈ విందుభోజనం ఇంకా ఎంత రుచిగా ఉంటుందో అనుకుంటూ, విందు పిండివంటలన్నీ పూర్తిగా తయారయేంతవరకు ఆ పసం దైన సువాసన గాలి పీలుస్తూ అక్కడే కూచున్నాడు. అయితే ఆ ధనవంతుడు, ఆ బిచ్చగాడికి పిడికెడు అన్నంకూడా పెట్టించలేదు.

మరునాడు ఆ వర్తకుడు కనిపించినప్పుడు బిచ్చగాడు "అయ్యా! మీరు ఎంత మంచివారని చెప్పాలో నాకే తెలియటం లేదు. మీ వంటపందిరి దగ్గరైనా నన్ను కూచోనిచ్చారుగదా ? మీ పసందైన మేకమాంసం కూరల కమ్మని వాసన పీల్చేటప్పటికే నాకు సంతృప్తిగా భోజనం చేసినట్టుంది," అన్నాడు.

"సరి, సరి ! అందుకనేమో నిన్న మా మేకమాంసం ఏమీ రుచీ పచీ లేకుండా పోయింది. ఆ కమ్మని వాసనంతా నువ్వే పీల్చేసి ఉండాలి సందేహం లేదు," అన్నాడు వర్తకుడు.

అంతటితో ఊరుకోక రాజువద్దకు వెళ్ళి బిచ్చగాడిమీద తన మేకమాంసంకూరల కమ్మని వాసనంతా అపహరించుకుపోయాడని అన్యాయంగా ఫిర్యాదు చేశాడు.

రాజు వర్తకుల విషయంలో పక్షపాతం గలవాడు కాబట్టి అతడు చెప్పిన ఫిర్యాదును నమ్మి, ఆ నేరం చేసినందుకు బిచ్చ గాడు పండ్రెండు వెండి నాణాలు ఆ వర్తకుడికి ఇచ్చి తీరాలని తీర్పుచెప్పాడు.

బిచ్చగాడి చేతిలో పైసా కూడా లేదు. మర్నాడు పది వెండినాణాలు చెల్లించాలి. పాపం! ఏడుస్తూ వెళ్ళిపోయాడు.

అదృష్టవశాత్తు వాడికి అబునువాస్ ఎదురుపడ్డాడు. రాజుగారి అన్యాయపు తీర్పుసంగతి చెప్పాడు. అబునువాస్ జాలిపడి, "నేను నీకు సాయం చేస్తాను. దిగులుపడకు. నీ అప్పు తీర్చిపారెయ్యటానికి రేపు ఉదయం కలుసుకుందాంలే?" అని ధైర్యం చెప్పాడు.

మరుసటిదినం అబునువాస్ బిచ్చగాడితోసహా రాజసభకు వెళ్ళాడు. వర్తకుడు కూడా తనపైకాన్ని తీసుకోటానికి వచ్చాడు.

అబునువాస్ వర్తకుణ్ణి చూసి, "నీ డబ్బు చెల్లిస్తే పుచ్చుకోవటానికి సిద్ధంగా వున్నావయ్యా?" అని అడిగాడు.

వర్తకుడు, "ఆ! సిద్ధంగానే ఉన్నాను. ఇవ్వండి," అన్నాడు.

అబునువాస్ పంద్రెండు వెండి నాణాలు తీసి బిచ్చగాడి చేతికిచ్చాడు.

"ఇదిగో! వాటిని భూమి మీద పడెయ్యి!" అన్నాడు అబునువాస్. అట్లాగే బిచ్చగాడు ఆ నాణాల్ని నేల మీద పడేశాడు. అవి రాతి నేలమీద పడగానే గణ, గణ మని మ్రోగాయి.

"విన్నావా! ఆ నాణాల టింగు, టింగు మోత!" అన్నాడు అబునువాస్.

"ఆ! విన్నాను," అన్నాడు వర్తకుడు.

"ఆ వెండినాణాల్లో నీకు రావలసిన భాగం ఆ టింగ్ టింగే. తీసుకో," అన్నాడు అబునువాస్.

నీ భోజనం కమ్మదనం వాసన చూసినంత మాత్రాన నువ్వు నష్టపోతే, ఆ బిచ్చగాడి డబ్బు గణ, గణ ధ్వని నువ్వు

విన్నావు గనుక అది నీకు ముట్టినట్టే. "ఇక వెళ్లు!" అని విప్పి చెప్పాడు అబునువాస్.

అబునువాస్ చెప్పిన న్యాయంప్రకారం బిచ్చగాడు వర్తకుడికి పన్నెండు కాసులూ చెల్లించినట్టే అని రాజుగారు కూడా ఒప్పుకొన్నారు. తగాదా తీరిపోయింది.

సౌదీ అరేబియా కథ




హాస్యగాడు అబునువాస్




నలుగురు యువకులు

# 8. నలుగురు యువకులు

బర్మాదేశంలో ఒక చిన్న పల్లెటూళ్ళో నలుగురు యువకు లుండేవాళ్లు. వాళ్లు చిత్రవిచిత్రమైన, నమ్మటానికి వీలులేని కథలు అల్లి చెప్పటంలో చాలా తెలివిగలవాళ్లు.

ఒకనాడు, ఆగ్రామం వెలుపలగల సత్రవులోకి, అందమైన విలువగల దుస్తులువేసుకున్న ఒక ప్రయాణికుడు కాస్సేపు విశ్రాంతి తీసుకుపోదామని వచ్చాడు. ఈ సంగతి నలుగురు యువకులు చూశారు. వీళ్లు నలుగురూ ఎట్లాగైనా ఆ ప్రయాణికుని విలువైన దుస్తులను కాజెయ్యాలని పన్నాగం పన్నారు. సత్రవులోకి వెళ్లి ఆ ప్రయాణికుడు వినేటట్లు వాళ్లలో వాళ్లే ఏదో వాదించుకోటం మొదలుపెట్టారు.

కొంతసేపు అయాక, ఆ నలుగురిలో ఒకడు మనం కథలు చెప్పటంలో పందెం వేసుకుందా మన్నాడు. ఆ పోటీకి కొన్ని షరతులు ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ వున్న వాళ్లందరు తమ అద్భుతమైన అనుభవాల్ని చెప్పాలి. అలా చెప్తున్నప్పుడు, ఇంకొక డెవడైనా ఆ కథ నిజంకాదని సందేహిస్తే వాడు ఆ కథ చెప్పినవాడికి బానిస అయిపోవాలి, అనుకున్నారు. ఆ ప్రయాణికుడు కూడా ఈ పోటీకి ఒప్పుకున్నాడు. అందరూ కలిసి సరేనంటే సరే అనుకున్నారు. ప్రయాణికుడు వట్టి తెలివి లేని దద్దమ్మ లాగున్నాడే అని నలుగురూ ముసి ముసి నవ్వులు

నవ్వుకున్నారు. ఎందుకంటే, వాళ్ళు చెప్పబోయే కథలు ఎవరూ నమ్మటానికి వీలులేనివని వాళ్లకు తెలుసు. అంచేత ఆ ప్రయాణికుడు తమకిమల్లే, అలాంటి కల్ల బొల్లి కథలు చెప్పలేనివాడు అయిఉంటాడు అనుకున్నారు. ఎట్లాగైతేనేం, ప్రయాణికుని విలువైన బట్టలను సులభంగా కొట్టెయ్యవచ్చునని లోలోపల సంతోష పడుతున్నారు. అతడు ఆ పోటీలో ఓడిపోతాడు, జయించిన తమకు బానిసై పోతాడని అనుకున్నారు. అప్పుడు బానిసకు చెందినవన్నీ జయించిన వాళ్ళకి స్వాధీనం అయిపోతాయి గదా అని, ఆ యువకులు నలుగురూ ఈ పన్నాగం పన్నారు. వెంటనే ఆ ఊళ్లోకి వెళ్లి, ఆ ఊరి పెద్దని ఈ కథల పోటీలో న్యాయం చెప్పే పెద్దమనిషిగా పిలుచుకొచ్చారు.

మొదటి యువకుడు తన అద్భుతమైన కథ ప్రారంభించి ఇట్లా చెప్పుకొచ్చాడు :—

"నేను పుట్టటానికి ముందు, మా అమ్మ మా నాన్నని మా యింటిముందర రేగిచెట్టు ఎక్కి, పళ్లు కోసి ఇవ్వమని అడిగింది. ఆ రేగిచెట్టు చాలా ఎత్తుగా, పెద్దదిగా ఉండటం మూలాన, మా నాన్న ఎక్కలేక పోయాడు. తరువాత మా అమ్మ రేగిపళ్లు కోసి ఇవ్వమని మా తమ్ముళ్లని అడిగింది. వాళ్ళు కూడా ఆ చెట్టెక్కి రేగిపళ్ళను మేము కోయలేమమ్మా! అన్నారు. మా తల్లి ఆశాభంగం చెందటం నే నెంత మాత్రం సహించలేకపోయాను. ఎవ్వరూ చూడని సమయం కనిపెట్టి, నేనే చెట్టెక్కి, రేగిపళ్లన్నీ కోశాను. వాటిని వంటింట్లోకి తీసి కెళ్లి గప్‌చిప్‌గా పెట్టేశాను. ఆ రేగిపళ్లు ఎక్కడి నించి వచ్చాయో, ఎవరు వంటింట్లో పెట్టారో ఎవరికీ తెలియదు. అయితే మా అమ్మ మాత్రం చాలా సంతోషించింది," అని చెప్పి తన కథ ముగించాడు.

కథంతా చెప్పిన తరువాత మొదటి యువకుడు ప్రయాణి కుని ముఖం తేరిపార చూశాడు. తన కథ సరిగ్గా లేదని అతడు సందేహిస్తాడేమో అనుకున్నాడు. కాని అతడు కథ బాగుం దన్నట్లు తల ఊపేటప్పటికి, తక్కిన ముగ్గురు యువకులు కూడా అతనితోపాటు తల లూపారు.

ఇంక రెండవ యువకుడు తన కథ మొదలుపెట్టాడు :— "నేను పుట్టిన వారంరోజులకు, అడవిలో నడచిపోతుండగా పండిన పళ్లతో నిండిన ఒక ఖర్జూరపుచెట్టు కనిపించింది. నాకు చాలా ఆకలేసింది. త్వరగా చెట్టెక్కి పొట్ట పగిలేట్టు ఖర్జూరపు పళ్లన్నీ బాగా తిన్నాను. తినేసరికి బద్ధకం, మందకొడితనం ఎక్కువై నిద్రమత్తు వచ్చేసింది. చెట్టు దిగలేకపోయాను. ఆ ఊళ్లోకి వెళ్లి ఒక నిచ్చెన తెచ్చి, దానిని చెట్టుకు ఆధారంగాపెట్టి ఎల్లాగో నిచ్చెన మెట్లమీదుగా మెల్లగా క్రిందికి దిగాను. నాకే గనుక ఆ నిచ్చెన దొరక్కపోతే నేను ఇంకా ఇప్పటి దాకా ఆ ఖర్జూ రపుచెట్టుమీదే వుండిపోయే వాడిని," అని తన అద్భుతమైన కథ పూర్తి చేశాడు. ప్రయాణికుడి వైపు చూశాడు. అతడు ఈ కథని ఎంత మాత్రం నమ్మడనుకున్నాడు. కాని, ఆ ప్రయాణి కుడు కథ బాగుందన్నట్లు తల ఊపాడు. తక్కిన ముగ్గురూ అతనిలాగే తలలూపారు.

ఇప్పుడు మూడవయువకుడు తన కథప్రారంభించాడు :— "నేను పుట్టిన ఏడాదికే బాగా ఎదిగి ముసలివాడినై పోయాను. ఒక కుందేలు ఎత్తుగా పెరిగిఉన్న గడ్డిలోకి గబ గబా పరుగెత్తటం చూశాను. నేను దాన్ని తరుముకు పోయాను. తీరా దగ్గరికి వెళ్లి చూద్దునుగదా ! నేను తరుముకు వచ్చిన జంతువు కుందేలు కాదు. భయంకర మైన పులి. నన్ను చూడగానే ఆ పులి నన్ను మింగెయ్యటానికి అమాంతంగా నోరు తెరిచింది. నన్ను

మింగవద్దని, నేను నిర్దోషినని, నన్ను మింగటం ధర్మంకాదని, ఎన్నో విధాల ఆ పులితో మొరబెట్టు కున్నాను. నేను కుందేలుకోసం వెతుకుతూండగా, తలవని తలంపుగా పులి ఎదురైందని, కాబట్టి నన్ను వదలివేయమని మరీ, మరీ వేడుకు న్నాను. నా మాటలు పులి పెడచెవిని పెట్టింది. నా ప్రయత్న మంతా బూడిదలో పోసిన పన్నీరయింది. పులి ఇంకా నోరు పెద్దగా తెరచుకొని, నన్ను మింగటానికి చూస్తూ, గాండ్రిస్తూనే ఉంది. నాకు పట్ట లేనంత కోపం వచ్చింది. పులి క్రూరత్వాన్ని చూసేటప్పటికి మరీ వళ్లూపై తెలియకుండా పోయింది. ఇంకే ముందీ! ఒక్క పెట్టున వీరాధివీరుడి లాగా, ఆ పులిని ఎడమ చేతితో పట్టుకొని రెండు చీలికలుగా చీల్చిపారేశాను," అని కథ పూర్తిచేశాడు.

ఈ కథ చెప్పిన మూడవ యువకుడు తన వీరగాథను విన్న ప్రయాణికుడు తన కట్టు కథను ఏ మాత్రం నమ్మడను కున్నాడు. కాని, ఆ ప్రయాణికుడు కథ బాగుందన్నట్లు తల ఊపాడు.

ఇది చూసి నాలుగో యువకుడు తన కథ మొదలుపెట్టాడు: "పోయిన సంవత్సరం, నేను సరదాగా చేపలు పట్టటానికని పడ వలో బయలుదేరి వెళ్లాను. అయితే పేరుకైనా ఒక్క చేపని కూడా పట్టలేకపోయాను. తక్కిన చేపలవాళ్లని అడిగితే, వాళ్లకు కూడా ఒక్క చేపైనా దొరకలేదు. 'మా గతీ అంతే అయింది,' అన్నారు. చేపలు దొరకక్కపోవటానికి కారణం కనుక్కోవాలని పట్టుపట్టాను. వెంటనే ఆ నదిలో దూకి, ఈదుకుంటూ బాగా లోతుకి వెళ్లిపోయాను. నది అడుక్కి వెళ్లేటప్పటికి, అమ్మయ్యో కొండంత పెద్ద చేప కనబడింది. ఈ పెద్ద చేపే, తక్కిన చిన్న చేప లన్నింటిని స్వాహాచేస్తూందని కనిపెట్టేశాను. అందుకనే

మా కెవ్వరికి ఒక్క చేపైనా దొరకలేదు అనుకొన్నాను. నాకు తగనికోపం వచ్చేసింది. ఆ కొండంత చేపను నా పిడికిలితో గట్టిగా ఒక్క గుద్దు గుద్ది చంపిపారేశాను. ఇంత కష్టపడి దాన్ని చంపేటప్పటికి చాలా అలసిపోయాను. చెప్పలేనంత ఆకలి వేసేసింది. అక్కడే ఆ పెద్ద చేపను తినెయ్యాలను కున్నాను. వెంటనే చిన్న మంట వేసి, చేపను బాగా కాల్చి, ఆ కమ్మని చేపని, కాస్తకూడా మిగల్చకుండా, అంతా నేనే తృప్తిగా తినేశాను. మళ్ళీ నా పడవెక్కి హాయిగా ఇల్లు చేరుకున్నాను," అని కథ ముగించాడు నాలుగవ యువకుడు. తన వింత కథ విని ఆ ప్రయాణికుడు తప్పక నవ్వుతాడని, ఇది నమ్మతగిన కథ కాదంటాడనీ అనుకున్నాడు. కాని, ఆ ప్రయాణికుడు మామూలుగా కథ బాగానే ఉందన్నట్లు తలూపేశాడు. తక్కిన వారు కూడా తల లూపేశారు.

చిట్టచివరికి, ఆ ప్రయాణికుడు తన కథ చెప్పవలసి వచ్చింది. అతడు తన విచిత్ర కథ మొదలుపెట్టాడు.

"కొన్ని ఏళ్ళ క్రిందట నాకు వ్యవసాయం చేసుకోటానికి ఒక పొలముండేది. ఆ పొలంలో ఒక పళ్ళచెట్టుండేది. అయితే, అది చాలా చిత్రమైన చెట్టు. దానికి నాలుగు కొమ్మలు మాత్ర ముండేవి. ఆకులు అసలే లేవు. ప్రతి కొమ్మ చివర ఒక్కొక్క పండు మాత్రం ఉంది. ఆ నాలుగు పళ్ళు పండగానే చెట్టెక్కి వాటిని కోసుకున్నాను. ఒక్కొక్క పండు కత్తితో కోసేసరికి అందులోంచి, ఒక్కొక్క మనిషి దూకి ఇవతల పడ్డాడు. వాళ్లు నా చెట్టులో కాసిన పళ్ళల్లోంచి పుట్టుకొచ్చారు కాబట్టి, వాళ్లు నలుగురు న్యాయ శాస్త్రం ప్రకారం నా సొత్తు అయిపోయారు. అంటే, నాకు బానిసలై పోయారన్నమాట. అంచేత వాళ్ళచేత నా పొలంలో పని చేయించుకునేవాణ్ణి. ఇట్లా కొన్ని వారాలు

గడచిపోయాయి. ఆ నలుగురు రాను రాను పని ఎగగొడుతూ, సోమరిపోతు లయ్యారు. ఒకనాడు అందరూ కలిసి నాకు చెప్ప కుండానే కథలు, పుక్కిటి పురాణాలు చెప్పుకుంటూ కాలం గడప వచ్చునని పారిపోయారు. ఆనాటి నుంచి, నేను వాళ్ళకోసం దేశమంతా వెదకుతూ, ఎట్లాగైనా వాళ్ళని పట్టుకోవాలని విధీ విరామం లేకుండా తిరుగుతున్నాను. తీరా ఈ ఊరు వచ్చాక నా కిప్పు డెంతో సంతోషంగా ఉంది. నా బానిసలు నలుగురూ ఇక్కడే, ఈ సత్రంలోనే దొరికారు. మీరే నా బానిసలని గుర్తు పట్టాను. కాబట్టి ఇక లేవండి! నా పొలానికి తిరిగివచ్చి, ఇకనైనా బుద్ధిగా పని చేయండి," అని ప్రయాణీకుడు తన కథను పూర్తిచేశాడు.

ఈ గాథ అంతా విన్న నలుగురు యువకులూ తెల్ల బోయారు. వాళ్లకి నోట మాట రావటంలేదు. కదలక, మెద లక కూచున్నారు, ఏమి చెప్పటానికి తోచలేదు. ప్రయాణీకుడి కథ నిజమని ఒప్పుకుంటే, వాళ్లు నలుగురు అతని పారిపోయిన బానిసలేనని ఒప్పుకున్న వారౌతారు. అతడు చెప్పిన కథంతా అబద్ధం అంటే, పోటీలో ఓడిపోయి, అల్లాగైనా, అతనికి బాని సలై పోతారు. ఏ విధంగా చూసినా వాళ్లతనికి బానిసలవాల్సి వచ్చింది. "ముందుకు పోతే నుయ్యి, వెనక్కుపోతే గొయ్యి" అన్నట్టుగా ఉంది వాళ్ళ పని.

చివరికి, ఈ పోటీకి తగవరిగా నిలబడ్డ ఊరిపెద్ద వారిని ఒకటికి రెండుసార్లు, "ప్రయాణీకుని కథ నమ్ముతారా?" అని అడిగాడు. యువకులు నలుగురు మాట్లాడలేదు. మళ్ళీ అడి గాడు. ఊహుఁ! ఒక్క అక్షరమైనా వాళ్లనోటినుండి బయటకు రా లేదు. మధ్యవర్తిగా వచ్చిన పెద్దమనిషి న్యాయంగా ఆ ప్రయాణీకుడే కథల పోటీలో గెలిచాడని తీర్పు చెప్పాడు.

ప్రయాణికుడు ఆ నలుగురు యువకుల్ని చూసి, "మీరు నలుగురు నాకు బానిస లయారు. మీరు కట్టుకున్న బట్టలు కూడా నాకు చెందాలి గదా! ముందు మీ బట్టలన్నీ విప్పి నాకివ్వండి. తరువాత మిమ్మల్ని వదలి పెడతాలెండి," అన్నాడు.

మారుమాటాడకుండా, నలుగురు యువకులు వాళ్ళు కట్టుకున్న బట్టలన్నీ విప్పి ప్రయాణికుడికి ఇచ్చారు.

అతడు వాటి నన్నింటిని చక్కగా మూట గట్టుకొని, భుజంమీద వేసుకొని, తనదారిని తాను వెళ్ళిపోయాడు. అయితే, ఈ నలుగురు తెలివిగల యువకులు సత్రంలో బిక్కమొగాలు పెట్టుకొని దిగం బరులుగా దిగబడి పోయారు.

బర్మా

# 9. ఉప్పు — రొట్టె

పూర్వం ఒక రాజుండేవాడు. ఆ రాజుకు ముగ్గురు కూతుళ్లు. ఆ ముగ్గురిలో కడసారి కూతురు మీద రాజుకి ప్రేమ ఎక్కువ. అందువల్ల తక్కిన ఇద్దరు, కూతుళ్ళకి కోపంగా ఉండేది. అసూయతో ఎట్లాగైనా సరే, తండ్రికి కడగొట్టు చెల్లెలంటే ప్రేమ లేకుండా చెయ్యాలని పెద్ద కూతుళ్ళిద్దరూ ఎన్నో ప్రియత్నాలు చేశారు. సమయం దొరికినప్పుడల్లా, తండ్రికి తమమీద ప్రేమ ఎక్కువ అవటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుండేవారు. వీలు దొరికినపుడల్లా ఆ పిల్ల మీద తండ్రితో చాడీలు, పితూరీలు చెప్పేవాళ్లు. ఆ చిన్నకూతురికి తండ్రిమీద కొంచెం కూడా ప్రేమ, విశ్వాసం లేవనేవాళ్లు. ఈ చుప్పనాతి తనం వల్ల ఎప్పుడూ మనస్సులో కలవర పడుతునే ఉండేవాళ్లు. అసూయ పిశాచంలా వాళ్ళని బాధిస్తూండేది.

రాజు ఈ చెప్పుడు మాటలన్నీ వినగా వినగా, చిన్న కూతురికి తన మీద నిజంగానే ప్రేమ లేదేమో అని అనుమాన పడ్డాడు.

ఒక రోజున, ముగ్గురు కూతుళ్ళూ సంతోషంగా తండ్రి చుట్టూ కూచుని ఉన్నారు. అప్పుడు రాజు ముగ్గురు కూతుళ్ళ మనస్సులూ పరీక్షించా లనుకున్నాడు. తన మీద ఎవరికి ఎంత ప్రేమ ఉన్నదీ తెలుసుకోవాలని ఆయన కుతూహలం. ముందుగా

పెద్ద కూతుర్ని పిలిచి తన మీద ఆమెకి ఎంత ప్రేమ ఉందో చెప్పమన్నాడు.

"నాన్నగారూ ! నిజంగా నేను స్వర్గంలో ఉన్న భగవంతుణ్ణి ఎంత ప్రేమిస్తున్నానో మిమ్మల్ని అంత ప్రేమిస్తున్నాను," అంది పెద్ద కూతురు. ఆ మాటలు విని రాజు సంతోషించాడు.

రెండవ కూతుర్ని కూడా అదే ప్రశ్న అడిగాడు.

"నాన్నగారూ ! నిజంగా మిమ్మల్ని నా ప్రాణంతో సమానంగా ప్రేమిస్తున్నాను." అంది ఆమె. ఈ మాటలు కూడా రాజు మనస్సుకి ఎంతో సంతోషం కలిగించాయి.

తరువాత రాజు చిన్న అమ్మాయి వైపు తిరిగి, "నా మీద నీ కెంత ప్రేముందో నువ్వుకూడా చెప్పమ్మా !" అన్నాడు.

"నాన్నగారూ ! మనం తినే ఆహారంలో నాకు రొట్టెమీద, ఉప్పు మీద ఎంత ప్రేమో, మీ రన్నా అంతే ప్రేమ," అంది ఆమె. (మనం అన్నం తిన్నట్లు ఆ దేశపు వాళ్లు రొట్టె తింటారు.)

ఈ మాటలు వినేసరికి రాజుకి ఆశ్చర్యం కలిగింది. పేద వాళ్లు కూడా తినే రొట్టె, ఉప్పు మీద ఉన్నంత ప్రేమ తన మీద ఉందనే సరికి రాజుకి చాలా కోపం వచ్చింది. వెంటనే తన సేవకుల్ని పిలిచి, తన కడసారి కూతుర్ని ఇంట్లోంచి తరిమివేయమన్నాడు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం సేవకులు రాజకుమారిని తీసుకుపోయి నట్టడివిలో వదిలిపెట్టారు. తక్కిన ఇద్దరి కూతుళ్ళకీ కళ్లు చల్లబడ్డాయి.

ఆ రాజ కుమారి పాపం ఆ అడవిలో దరి, దోవ తోచక ఎంతో భయపడిపోయింది. తనను గారాబంగా పెంచిన తండ్రిని, ఇంటిని తలచుకొని వలవల ఏడ్చింది. అంత పెద్ద అడవిలో

తాను ఒక్కతే! ఏం చేస్తుంది? ఎక్కడికని పోతుంది? తండ్రికి తన మీద ఎందుకు కోపం వచ్చిందో, ఎందుకిల్లా తనను అడవుల పాలు చేశాడో ఆమెకు ఏమీ అర్థంకాలేదు. ఆ నట్టడవిలో తిండి, తిప్పలూ లేకుండా తిరిగి తిరిగి అలసిపోయింది. ఆ అడవిలో క్రూరమృగాలు చంపేస్తాయేమోనని భయపడి, పెద్ద చెట్టుమీద ఎక్కి కూచుంది ప్రాణం కాపాడుకోటానికి.

అదృష్టం కొద్దీ, అడవిలోకి ఎవరో ఒక రాజకుమారుడు వేట కోసం వచ్చాడు. గుఱ్ఱంమీద ఎక్కి, వేట కుక్కలతో సహా వచ్చాడు. కొంతసేపటికి, వేట కుక్కలు బిగ్గరగా మొరగటం రాజు విన్నాడు. అవి పోయిన దారినే పోయి చూశాడు. వేటకుక్కలు ఒక పెద్ద చెట్టు చుట్టూ తిరుగుతూ మొరగడం విన్నాడు. తల పైకెత్తి చెట్టుమీద ఒకవేళ ఎలుగు బంటు ఏదైనా వుందేమోనని చూశాడు. ఎలుగు బంటు లేదు సరిగదా, ఒక అందమైన అమ్మాయి చెట్టుమీద విచారంగా కూచుని ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమెను చూడగానే రాజుకి జాలి కలిగింది. ప్రేమతో పలకరించాడు. మెల్లగా చెట్టు దిగి రమ్మని కోరాడు. ఆమె దిగి రాగానే, గుఱ్ఱంమీద ఎక్కించుకొని తన రాజభవనానికి తీసుకు వెళ్ళిపోయాడు. ఆమెకు స్నానానికి, భోజనానికి, ఉండటానికీ కావలసిన అన్ని సౌకర్యాలు చేయించాడు.

రాజకుమారుడు తనని ఇంత దయగా చూస్తున్నందుకు ఆ రాజకుమార్తెకి ఎంతో సంతోషం కలిగింది.

ఆయన అడిగేసరికి, తను పడ్డ కష్టాలన్నీ, తన కథంతా చెప్పింది. ఆ రాజకన్య మంచితనం, అంద చందం ఆ రాజ కుమారుడికి ఎంతో ముచ్చటగా ఉన్నాయి. రాజ భవనంలో

ఆమె సుఖంగా కాలం గడుపుతూ వచ్చింది. కొన్నాళ్ళకి రాజు ఆమెను ప్రేమించి పెండ్లి చేసుకోవా లనుకున్నాడు. ఆమె కూడా ఆ రాజకుమారుని మనసారా ప్రేమించింది. పెండ్లి చేసుకుందామని నిశ్చయించుకున్నారు.

పెళ్ళికి మంచి ముహూర్తం పెట్టించారు. చుట్టూ గల ఏడుదేశాల రాజులకి ఆహ్వాన పత్రికలు పంపారు. పెళ్లికి ఆ రాజులు, చక్రవర్తులు, బంధువులు, స్నేహితులు అంతా వచ్చారు. పెళ్ళికి వచ్చిన రాజులలో ఆ పెళ్ళికూతురు తండ్రి కూడా ఉన్నాడు. ఆయనతోపాటు ఆమె ఇద్దరు అక్కలు కూడా వచ్చారు. అయితే వాళ్ళెవరూ పెళ్ళికూతుర్ని గుర్తుపట్టలేక పోయారు. తమ చెల్లెలు ఆ అడవిలో అప్పుడే చనిపోయి ఉంటుందను కున్నారు.

పెళ్ళి విందుకి చాలా గొప్పగా ఏర్పాట్లు చేయించారు. రక రకాల పిండివంటలతో విందు సిద్ధం చేశారు. పెళ్ళికి వచ్చిన వారంతా భోజనానికి కూచున్నారు. ముఖ్యంగా ముగ్గురుకూతుళ్ల తండ్రికి బాగా మర్యాదచేసి, పెద్దపీట వేసి వడ్డించారు. ఆయనకు అన్నీ వడ్డించారుగాని, రొట్టె, ఉప్పుమాత్రం వడ్డించలేదు. దేంట్లోను ఉప్పులేదు. రాజకన్య తండ్రి ఏది నోట్లో పెట్టుకున్నా ఉప్పు లేదు. చప్పగా వుంది. రొట్టె అసలే లేదు. అటు చూశాడు, ఇటుచూశాడు. చివరికి ఉండబట్టలేక, "ఇదేమిటి, నాకు అర్థం కావటంలేదు. విందులో వుండవలసిన రెండు ముఖ్యమైన పదార్థాలు, రొట్టె, ఉప్పు లేకుండా చేశారు. ఇదేం విందు ?" అన్నాడు.

రాణిగా అలంకరించుకుని వచ్చి అక్కడ నిలబడి చూస్తూన్న పెళ్లికూతురు ఆ మాట విన్న వెంటనే నవ్వుతూ, "ఏమిటీ? విందునుగురించి ఏదో అంటున్నారు?" అంది.

"మరేమీ లేదమ్మా! ఇంత గొప్ప విందులో అన్నిటి కన్నా ముఖ్యమైన ఉప్పు, రొట్టె లోపం చేశారేమిటా! అను కుంటున్నాను."

"అవును. ప్రపంచంలో అవి రెండే చాలా ముఖ్యమైనవి. ఒకప్పుడు నేను మా నాన్నగారిని ఈ రెంటితో సమానంగా ప్రేమిస్తున్నానని చెప్పినందుకే నన్ను ఇంట్లోంచి గెంటించి, అడ వులపాలు చేశారు," అని చెప్పింది.

ఈ మాటలు వినగానే తండ్రి ఆమె తన కూతురని గ్రహించాడు. ఆ సంతోషంలో పెద్ద కేకపెట్టి "తల్లీ" అంటూ ఆమెను ప్రేమతో కౌగలించు కొన్నాడు. తనపైన ఆమెకు గల నిజమైన ప్రేమను అర్థంచేసుకోలేక, ఆమెను అడవికి తరిమి, కష్టపెట్టి నందుకు క్షమించమని బ్రతిమాలాడు.

అక్కలిద్దరూ చెల్లెలిపైన అసూయతో పన్నిన కుట్రంతా గ్రహించాడు. పెద్దకూతుళ్ళిద్దరిని ఇంటి నుండి అడవికి తరిమే శాడు. వాళ్ళగతి ఏ మైందో ఆ నాటినుండి ఈ నాటివరకు ఎవ్వరికీ తెలియదు. ఏ రాజకుమారులైనా అడవికి వేటకోసం వచ్చి వాళ్ళని రక్షించారో లేదో ఎవరూ వినలేదు, అనుకోలేదు.

---

స్వీడన్

---




ఉప్పు - రొట్టె




బల్లోర్కి వెళ్లిన ముసలి తండ్రి

## 10. బళ్ళోకి వెళ్లిన ముసలితండ్రి

ఒక ముసలి కాపుకి నలుగురు కొడుకులు. పాపం! ఆయనకు బాగా ముసలితనం రావటం మూలాన, ఇంక ఆట్టే కాలం బ్రతుకనేమో అన్నభయం పట్టుకుంది. ఆస్తంతా నలుగురు కొడుకులకీ పంచి పెట్టాడు. "ఇంకనే బ్రతికే నాలుగు రోజులూ హాయిగా నా బిడ్డల దగ్గరే ఉండి కాలం గడుపు కుంటాను," అను కున్నాడు.

ముందర, పెద్దకొడుకు ఇంటికి వెళ్ళాడు. ఆ కొడుకు కొన్నాళ్ళు తండ్రిని చాలా ప్రేమగా, గౌరవంగా చూశాడు. కన్న తండ్రికి తిండి, బట్టా ఇచ్చి పోషించటం తన ధర్మం అను కున్నాడు. ఇట్లా కొంత కాలం సాగింది. క్రమంగా కొన్నా ళ్లకి ఈ ముసలివాణ్ణి నేను ఎన్నాళ్లిలా పోషించగలను!" అను కున్నాడు. అప్పుడప్పుడు విసుక్కోటం ప్రారంభించాడు. ఒక్కొకసారి కోపంతో తండ్రిమీద కేకలుకూడా వేస్తూండే వాడు.

తండ్రికి మొదట్లో వేరే ఏర్పాటు చేసిన గది ఇప్పుడు లేకుండా చేశారు. అతని గుడ్డలు చినిగి చింపిరైనా కుట్టే దిక్కు లేకపోయింది. ఆఖరికి వేళకి పిడికెడు మెతుకులు పెట్టటానికి కూడా ఎంతో విసుక్కోటం మొదలెట్టారు. మరొక దారి తెన్ను తోచక, ఆ ముసలి తండ్రి పెద్దకొడుకు ఇల్లు వదలి

మెల్లగా రెండవ కొడుకు దగ్గరికి చేరుకున్నాడు. పాపం తన పని, చేతిలో ఉన్న బియ్యాన్ని వదలుకొని తవుడుకు ఆశ పడ్డట్టు అయిందని విచారించాడు. నాలుగు రోజులుండేసరికి రెండవ కుమారుడు కన్నా మొదటి కుమారుడే ఎంతో నయమనిపించాడు. రెండవ కొడుకూ, కోడలూ ఇద్దరూ కలిసి, తండ్రి భోజనం చెయ్యటానికివస్తే, వట్టి పుణ్యానికే, సణుక్కోటం ప్రారంభించే వాళ్లు. అందులో కోడలు మరీని. ఎప్పుడూ తిట్టిపోస్తూండేది.

"మేమే నోటికి, చేతికి అందక అవస్థపడుతూంటే, ఈ ముసలాయన మాకు దాపరించాడేమిటి? మేమేమి కాపురం చెయ్యగలం బాబూ?" అంటూ కోడలు ఎప్పుడూ ముసలి మామను గదమాయిస్తుండేది.

ఈ కష్టాలన్నీ పడలేక ముసలాయన మూడవ కొడుకు దగ్గరకు వెళ్ళాడు. మళ్ళీ అక్కడా ఇదే పాట. చివరకు చచ్చి చెడి, కడసారి కొడుకు ఇంటికి వెళ్లాడు. ఈ కొడుకూ తక్కిన ముగ్గురుకొడుకులకీ ఏ మాత్రం తీసిపోలేదు. వాళ్ళే కొంత నయమేమో అనిపించేలా చేశాడు.

అన్నీ ఉండి దిక్కులేని బ్రతుకు అయింది ముసలాయన కథ. ఇట్టా నలుగురు కొడుకుల ఇళ్ళకూ తిరుగుతున్నాడు. తండ్రిని పోషించే భారం తమకు వదలిపోతే చాలుననే నలుగురు కొడుకులు చూస్తున్నారు. ఈ బాధ్యత ఎవరు వహించటమా అని ఎన్నో సార్లు వాళ్ళలో వాళ్ళే వాదించు కున్నారు. ఏ కొడుక్కి ఆ కొడుకే తాను తప్పించుకుంటానికి ఏదో ఒక సాకు చెపుతున్నాడు. ఒకడేమో నాకు బండెడు మంది పిల్లలున్నారనీ, మరొకడు నా భార్య గయ్యాళిలాగా తిడుతుందనీ, ఇంకొకడు మా ఇల్లు చాలా చిన్నది తగని ఇరుకు అనీ, మరోడు నేను చాలా బీదవాడిననీ, ఇట్లా ఏదో కారణం చెప్పి, "నువ్వు ఎక్కడి

కైనా వెళ్లుగాని మా దగ్గరకు మాత్రం రాబోకు," అని చెప్పేశారు.

పాపం! ఆ తండ్రి తన బిడ్డలందరినీ చూసి, కుమిలి కుమిలి ఏడ్చాడు. ఎక్కడికి పోవటానికి, ఏమిచెయ్యటానికి ముసలాయనకు ఏమీ తోచలేదు. "నేనేమి చెయ్యగలను నాయనలారా? అంతా మీ ఇష్టం. నన్ను మీ రేమి చేసినాసరే," అని ఏడుస్తూ అన్నాడు.

ఒకనాడు నలుగురు కొడుకులూ సంప్రదించుకొని, ముసలివాణ్ణి ఏమిచెయ్యాలా అని ఆలోచించారు. "ఏదైనా బళ్ళోకి పంపటం తప్ప వేరే మార్గం ఏదీ లేదు," అన్నారు. "ఎల్లాగూ బళ్లో బల్ల వుంటుంది గదా, దాని మీద కూచుంటాడు. ఒక సంచిలో ఏదైనా తిండికి ఇంత ఇచ్చి పంపేద్దాం," అన్నారు. ఈ సంగతంతా తండ్రితో చెప్పారు. ఇది వినగానే ఆ ముసలితండ్రి "ఇంకే మైనా చెయ్యండిగాని నన్ను బళ్ళోకిమాత్రం పంపబోకండి నాయనా!" అంటూ జాలిపుట్టేట్టు ఏడ్చాడు. "చివరకి నా కర్మం ఇలా కాలిందా? నేనేం పాపం చేశాను?" అనుకున్నాడు.

"నాకు చూపుకూడా మందగించింది. నా చుట్టూ ఏమున్నదో కూడా సరీగ్గా కనబడటంలేదు. అట్లాంటప్పుడు పుస్తకాల్లోని, సన్నని అక్షరాలు నా కెట్లా కనుపిస్తాయిరా చెప్పండి? ఇప్పుడింకా నాకు చదువువచ్చి చచ్చేదేమిటి? చావటానికి సిద్ధంగా ఉన్న నే నిప్పుడు అక్షరాలు నేర్చుకుని గుమస్తా పనిచేసి అఘోరించే దేమిటి?" అని గోలబెట్టాడు.

తండ్రి ఎంత మొత్తుకున్నా కొడుకులు వినిపించుకోలేదు. తండ్రి ఘోషంతా చెవిటివాళ్ల చెవుల్లో శంఖం ఊదినట్లైంది. ఏమీ ప్రయోజనం లేకపోయింది. కొడుకుల నిర్ణయం ప్రకారం

తండ్రి బళ్ళోకి వెళ్లక తప్పింది కాదు. ఆ ముసలిఘటం బళ్ళోకి బయలుదేరి వెళ్లాడు. కొడుకులు కొంత దూరం సాగనంపివచ్చారు.

అడవి అవతల ఉన్న పట్టణంలో బడికి ముసలాయన నడచి పోతున్నాడు, ఇంతలో ఆ దారిని బండిలో వెడుతున్న ఒక ప్రభువు ఎదురయ్యాడు. బండిని చూడగానే, ముసలితాత ఒక ప్రక్కకు తప్పుకున్నాడు. రోడ్డు అంచున నిలబడ్డాడు. ఆ ప్రభువు తన గుఱ్ఱాల్ని ఆపి, బండి దిగి, ఆ పండు ముసలి వాణ్ణి చూచి, "అయ్యా! ఏ ఊరు వెళుతున్నారు?" అని ప్రశ్నించాడు. "బళ్ళోకి" అని బదులు చెప్పాడు ముసలాయన, పొంగివస్తున్న యేడుపు దిగమింగుతూ.

"మీరా! బడికి వెళ్ళటం? ఈ పండు ముసలి తనంలోనా! నే నెక్కడా వినలేదే ఈ విచిత్రం? ఇంట్లో కాలు కదపకుండా, కడుపులో నీళ్ళు కదలకుండా ఉండాల్సిన రోజులివి. మీరేమిటి బడికి వెళ్ళి చదువుకోట మేమిటి?" అని జాలి పడ్డాడుప్రభువు.

ఆ ముసలితండ్రి తన గోడంతా ప్రభువుతో చెప్పుకున్నాడు. దుఃఖం ఆపుకోలేక పోయాడు. వెక్కి వెక్కి యేడ్చాడు. ఈ ముసలివాని కథంతా వినేటప్పటికి ప్రభువుకి జాలివేసింది. కొంచం ఆలోచించి "అయ్యా! మీరు ఏమాత్రం చింత పడకండి. నేను మీకు సాయం చేస్తాను. మీరు ఈ ముసలితనంలో బడికివెళ్ళి కష్టపడ నవసరంలేదు. ఇప్పుడు మీరు వెళ్ళదగినచోటు పాఠశాలకాదు. మీకేమీ కొదువకాదు. ఇకనైనా మీ ఆత్మని శాంతి పరచుకోండి. విచారించకండి," అని ప్రభువు ఓదార్పుమాటలు చెప్పాడు.

వెంటనే తన నడుముకి ఉన్న బెల్టులోంచి ఒక పట్టుసంచి తీసి దాని నిండా ఏవోపోసి, తన బండిలో ఉన్న చక్కని కొయ్యపెట్టెలో ఆ పట్టు సంచిని బాగా కట్టి పెట్టాడు. ఆ పెట్టె

ముసలివాడి చేతికిచ్చాడు. "ఈ పెట్టెని జాగ్రత్తగా ఇంటికి తీసుకెళ్ళి, నీ బిడ్డలతో నేను చెప్పే మాటలన్నీ చెప్పు," అని ప్రభువు వాళ్ళకు ఏమి చెప్పవలసిందీ వివరంగా చెప్పాడు. ముసలివాడు ప్రభువుకి నమస్కారం చేసి వెనక్కి తిరిగి, వచ్చిన దోవనే ఇల్లు చేరుకున్నాడు.

తండ్రి చంక క్రింద ఏదో పెట్టె పెట్టుకొని రావటం చూసే టప్పటికి, కొడుకులందరూ అందులో ఏవో విలువైనవి ఉన్నాయని భ్రమపడ్డారు. ఈసారి, కొడుకులుగాని, కోడళ్ళుగాని అతనిని ఇంటికి రావద్దని అనలేక పోయారు. ఆ పెట్టెలో ఏముందో అనే ఆశతో ఎదురు వెళ్ళారు.

"నాన్నగారు! మీరు అలసి పోయినట్లున్నారు. నాయింటికి వచ్చి, కాస్సేపు బడలిక తీర్చుకోండి," అన్నాడు ఒక కొడుకు. ఇంకొక కొడుకు, "నాన్నగారు! మనయింటికి వచ్చి భోజనం చెయ్యండి మీకు ఆకలౌతుండాలి," అని అప్యాయంగా పిలిచాడు. ఇలాగే నలుగురు కొడుకులు పిలిచారు.

తరువాత ముసలితండ్రి తనకు అడవిలో ఎదురైన ప్రభువు చెప్పమన్నదంతా వాళ్లకు చెప్పాడు.

"నాయనలారా! కొన్ని సంవత్సరాలకు ముందు, పడుచు తనంలో ఉన్నరోజుల్లో, కష్టపడినేను కొంత ధనం సంపాదించు కున్నాను. ముందు ముందు ఏమి జరుగబోతుందో మంచి చెడ్డ లెవ్వరం చెప్పలేం గదా! అందుకని, ఏకాలం ఎట్లా వస్తుందో అని జాగ్రత్తపడి, అడవిలోకి వెళ్ళి ఒక పెద్ద సింధూరపు చెట్టు కింద ఒక గొయ్యి తవ్వి, అందులో డబ్బు భద్రంగా పూడ్చి ఉంచాను. తరువాత ఆధనం మాటే మరచి పోయాను. నా బిడ్డలు బుద్ధిమంతులు గదా, వారే నన్ను కాపాడుతారు అనుకున్నాను. మొన్న మీరు నన్ను బడికి పంపి

నప్పుడు ఆ అడవి దోవనే వెడుతుంటే ఆ సింధూరపుచెట్టు పక్కగానే నడచి పోవాల్సి వచ్చింది. వెంటనే డబ్బుసంగతి జ్ఞాపకం వచ్చింది. "ఎన్నాళ్ల క్రిందటో నేను పాతిపెట్టిన వెండి కాసులు నా కై ఇంకా ఎదురు చూస్తున్నయ్యా?" అనుకుంటూ అక్కడ తవ్విచూశాను, నా అదృష్టం బాగుండబట్టి నా ధనం నాకు దొరికింది. అది తీసుకొని ఇంటికి వచ్చాను. ఈ ధనం మాత్రం నేను బ్రతికి ఉన్నంతవరకూ దాచి పెడతాను. నన్ను ఎవరు బాగా ప్రేమతో చూస్తారో వాళ్లకే ఈ పెట్టెలో దాచిన ధనంలో ఎక్కువ భాగం దక్కుతుంది. కాబట్టి నాయనా! నన్ను మీతో ఇక్కడే ఉండనివ్వండి. ఈ ధనం కోసమైనా మీలో ఎవరు నన్ను ఎక్కువ దయగా చూస్తారో చెప్పండి," అన్నాడు.

ఈ మాటలు విన్న తరువాత, అన్నదమ్ములు నలుగురూ నాన్నని నేను పోషిస్తానంటే, నేను పోషిస్తానని పోటీలు వేసుకున్నారు. ఒకడు "మా ఇంటికి రా నాన్నా!" అని పిల్చాడు. "కాదు, మా ఇంటికే వచ్చి తీరా" లని ఇంకోడు. ఇలా కొడుకు లందరూ పోటీలుపడి తండ్రికి చక్కని భోజనంపెట్టి, మంచిబట్టలు కొనిపెట్టి, ఎంతో శ్రద్ధగా ఆయనకి ఉపచారాలు చేస్తున్నారు. ముసలి తండ్రి జీవితం సుఖంగా గడచిపోతూంది.

కొన్నాళ్ళకి ఆయన మరణించాడు. ప్రాణం విడిచాడో లేదో, కొడుకు లందరూ తొందరగా ఆ పెట్టెను తీసుకోవాలని ఉబలాట పడ్డారు. నలుగురిలోను ఎవరు తండ్రిని ఎక్కువ భక్తితో పోషించారో, ఎవరికి పెట్టెలోగల సొత్తులో ఎక్కువ భాగం దక్కాలో తేల్చుకోవాలిగా! నేనంటే నేనని వాదించుకోటం మొదలు పెట్టారు. చివరకి ఇక లాభంలేదని రాజీపడి అందరూ సమానంగానే తండ్రిని ప్రేమతో చూశామనీ, కనక, తండ్రి ధనాన్ని సమానంగానే పంచుకోవాలనీ తీర్మానించుకున్నారు.

కొడుకులందరూ కలిసి తండ్రికి దహన క్రియలు చాలా బాగా చేశారు. ఆ గ్రామంలో వాళ్ళ బంధుమిత్రులందరికీ పెద్ద విందుకూడా చేశారు. ఇంకా మరికొంత డబ్బు గుడిపురోహితుడి కిచ్చి నలభై రోజులు తండ్రి ఆత్మ శాంతికోసం పూజలు, జపాలూ, కూడా చేయించారు.

నలుగురు కొడుకులూ ఒకరికంటే ఒకరు తమ పేరు గొప్పగా చెప్పుకోవాలని తండ్రి ఆత్మశాంతికోసం దానాలు ధర్మాలు చేసి బోలెడంత ధనం ఖర్చుపెట్టారు.

తండ్రి కార్యాలన్నీ పూర్తిఅయాక, ఆ పెట్టెతెరచి చూడాలని అందరికీ తొందరగా ఉంది. నలుగురూ చుట్టూ కూచుని పెట్టె తెరచి, పట్టుసంచీ బయటికి తీశారు. ఆ సంచి కదిలిస్తే ఘల్లు, ఘల్లు మని మోగుతున్నాయి. సంచీ విప్పి, బల్లమీద కుమ్మరించారు. వెంటనే అంతా తెల్లబోయారు. తళ, తళా మెరస్తూ గాజుముక్కలు కింద పడ్డాయి, వాళ్ల ఆశ నిరాశ అయింది. "వెధవ గాజుపెంకులు ! ఇదా! ఈ ముసలివాడి ధనం!" అని నలుగురు కొడుకులు కోపంతో తిట్టిపోసు కున్నారు.

అక్కడ చేరిన వారందరూ ఇదంతా చూసి నవ్వుకున్నారు.
"దిక్కులేని మీ ముసలితండ్రిని మీరు బళ్లోకి పంపించారు. ఆయన మీ లాగా యేళ్ళకొద్దీకాలం బడికివెళ్ళి చదువుకోక పోయినా, నేర్చుకున్న దేదో చక్కగా నేర్చుకున్నాడు. ఆ జ్ఞానంతో మీకు గొప్ప పాఠంచెప్పి పోయాడు," అన్నారు నలుగురు.

యు క్రేన్

# 11. పులుసు రాయి

యుద్ధం అయిపోయింది. ఒక సిపాయి మళ్ళీ ఇంటికి పోవాలని బయలుదేరి పోతున్నాడు. అలా పోతూ ఉండగా దారిలో ఒక చిన్న పల్లెటూరు దగ్గరికి వచ్చేసరికి, ఆకాశంనిండా కారు మేఘాలు కమ్ముకొచ్చినయి. చలిగాలి రివ్వు రివ్వున కొడుతూంది. వీటి అన్నిటికి తోడు కడుపులో ఆకలి దహించుకు పోతూంది. సిపాయి ఆ బాధ ఓర్చుకోలేకపోయాడు. ఆ పల్లెటూరు చిట్టచివర ఒక యిల్లు వుంది. ఆ ఇంటి దగ్గరకువెళ్ళి ఏదైనా తినటానికి పెట్టమని, ఆకలిగా ఉన్నదని ఆ ఇల్లాలిని అడిగాడు.

"మేమే తిన తిండిలేకుండా తిప్పలు పడుతుంటే నీకేమి పెట్టగలం బాబూ!" అన్నది ఆ ఇల్లాలు. కొంత దూరం పోయాక, మళ్ళీ ఇంకో ఇంటికి వెళ్ళి, "నాకు చాలా ఆకలిగా వుంది, కాస్త ఏదైన పెట్టండమ్మా!" అని అడిగాడు. ఆ ఇంటామె కూడా "మాకే ఏమీ లేదునాయనా! పోయిరా!" అంది.

వెంటనే సిపాయి, "పోనిలేండమ్మా, మీ వద్ద ఒక పెద్ద కుండ ఏదైనా ఉందా?" అని అడిగాడు. ఇల్లాలు పెద్దకుండ తెచ్చి సిపాయిముందు పెట్టింది. "మంచినీళ్లు ఉన్నయ్యా?" అన్నాడు, "నీళ్లకేమీ తక్కువ లేదు. బోలెడన్ని ఉన్నయి," అంది ఆ ఇల్లాలు.

''అయితే ఆ కుండ నిండా నీళ్లుపోసి పొయ్యిమీద పెట్టండి. నా దగ్గర ఒక అద్భుతమైన "పులుసురాయి" ఉంది అన్నాడు. (ఆ దేశంలో వాళ్లు చిక్కగా పులుసుకాచుకొని మనం పాయసం తాగినట్టు తాగుతారు.) "పులుసురాయి అంటే ఏమిటి నాయనా? మే మెప్పుడూ దాన్ని గురించి వినలేదే," అన్నారు ఆ యింట్లో వాళ్లు.

''ఈ పులుసురాయి వేసి కాస్తే పులుసు అమృతంలాగ బలే రుచిగా తయారవుతుంది, అన్నాడు సిపాయి. ఆ చిత్ర మైన పులుసురాయి చూడటానికి చుట్టుప్రక్కల వాళ్ళందరూ సిపాయి చుట్టూ మూగారు.

ఇంటి యజమానురాలు ఆ పెద్ద కుండనిండా నీళ్లుపోసి పొయ్యిమీద పెట్టింది. సిపాయి తన జేబులోంచి ఒక రాయి (చూట్టానికి మామూలు గులకరాయి లాగే ఉంది,) తీసి కుండలో పడేశాడు. ఇంక కుండలో నీళ్లు బాగా కాగనివ్వండి," అని చెప్పాడు సిపాయి. అందరూ ఆ కుండ చుట్టూ కూచున్నారు. నీళ్ళు బాగా మరిగేంతవరకూ చూస్తూ కూచున్నారు. "మీకు వీలుంటే కాస్త చింతపండు, ఉప్పు అందులో వెయ్యండి,'' అన్నాడు సిపాయి. చింతపండు బుట్ట, ఉప్పుతొట్టి తెచ్చి సిపాయి కిచ్చారు. కుండ పెద్దది కాబట్టి పట్టెడు చింతపండు, పిడికెడు ఉప్పు తీసుకొని ఆ కాగుతున్న నీటిలో వేశాడు. అందరూ సిపాయి ఇంకా ఏమిచేస్తాడో చూద్దామని చుట్టూ చేరారు. "కాసిని క్యారట్లు (ఎఱ్ఱ ముల్లంగి) దానిలో వేస్తే బాగుంటుం దేమో,'' అన్నాడు సిపాయి. ఆ ఇల్లాలు బల్లకింద దాచిన క్యారట్లు తెచ్చి తరిగి పులుసులో వేసింది. ఈ కారట్లు ఆ బల్ల కింద ఉండటం అంతకు ముందే సిపాయి చూశాడు. క్యారట్లు బాగా ఉడికేలోపల తన చుట్టూ చేరిన వారికి ఎంతో తమాషాగా

తాను యుద్ధంలో చేసిన వీర, సాహస కార్యాలను గురించిన కథలు చెప్పటం మొదలెట్టాడు.

కొన్ని బంగాళాదుంపలు కూడా వేస్తే, పులుసు ఇంకా చిక్కబడి బాగుంటుందని ఆ మాటల మధ్యలో సిపాయి మళ్ళీ సలహా యిచ్చాడు. ఆ ఇంటివారి పెద్ద కూతురు, "కాసిని దుంపలు ఇంటిలో ఉన్నాయిలే," అంటూ, అవి తెచ్చి పులుసులో వేసింది. పులుసు బాగా మరిగేదాకా అందరూ ఊరుకున్నారు.

"ఇంకేమీలేదుగాని, నాలుగు ఉల్లిపాయలు కూడా అందులో పడేశామంటే మంచి కమ్మని వాసన వస్తుంది," అన్నాడు సిపాయి. ఇంటికాపు ఇది వినగానే చిన్న కొడుకుతో పక్కయింట్లోంచి కాసిని ఉల్లిపాయలు అడిగి తెమ్మన్నాడు. వాడు చెంగున పరిగెత్తుకువెళ్ళి దోసెడు ఉల్లిపాయలు పట్టుకొచ్చాడు. అవి కూడా పులుసులో పడేశారు. పులుసు తయారయేలోగా అందరూ కథలు, కబుర్లు చెప్పుకుంటూ కూచున్నారు.

నేను మా అమ్మను, ఇంటినీ వదలి వచ్చింది మొదలు ఇంతవరకు మళ్ళీ క్యాబేజి ముఖం చూడలేదు," అని సిపాయి చెప్పేసరికి, ఆ ఇల్లాలు "త్వరగా వెళ్ళి తోటలో క్యాబేజి పువ్వొకటి కోసుకురావే?" అని చిన్న పిల్లను పంపించింది. అదికూడా తరిగి పులుసులో పడేశారు.

ఇంకా కాసేపటిలో పులుసు తయారవుతుందిలేండి. బాగా పక్వానికొచ్చింది," అని సిపాయి అనగానే ఇల్లాలు పొడుగాటి తెడ్డుతో పులుసు బాగా కలియబెట్టింది.

సమయానికి సరీగ్గా ఆ ఇంటిపెద్ద కొడుకు వేటకు వెళ్ళి అప్పుడే రెండు కుందేళ్ళను పట్టుకొచ్చాడు. "ఇదిగో చూడండి.

పులుసు ఇంకా పసందుగా ఉండాలంటే, ఆకుందేళ్ళను కోసివేస్తే ఇంకా బాగా రుచి వస్తుందిలాగుందే," అన్నాడు సిపాయి. వెంటనే వాటినికూడా కోసి పడేశారు. "ఆహా! ఘుమ, ఘుమ లాడుతూ, ఎంత కమ్మనివాసన వస్తూందో చూశారా! నోరూరుతూందే," అన్నాడు సిపాయి.

"అబ్బాయి! ఈ బాటసారి ఇవాళ ఒక పులుసురాయి తెచ్చాడు. దాంతో ఈ కుండలో మంచి పులుసు కాచాడు," అని కాపు తన పెద్దకొడుకుతో చెప్పాడు. చివరకి పులుసు కమ్మగా తయారైంది. పెద్దకుండతో చెయ్యబట్టి అందరికీ సరిపోయేంత వుంది కూడాను. సిపాయి, కాపు, కాపువాని భార్య, పెద్దపిల్ల, పెద్దకొడుకు, చిన్నపిల్ల, చిన్నకుఱ్ఱవాడు అందరూ కూచుని లొట్టలు వేసుకుంటూ తాగుతున్నారు పులుసు.

"సెబాష్! ఇది నిజంగా చాలా అద్భుతమైన పులుసు," అని కాపు సంతోషించాడు.

"ఆ పులుసురాయి చాలా అద్భుతమైనది. అదే పులుసుకి అంత రుచి తెచ్చింది," అన్నది కాపు భార్య.

"ఔను. ఆ పులుసురాయి చాలా గొప్పది. ఇవ్వాళ నేను చేసినట్టు పులుసు కాస్తే, ఈ పులుసురాయి పులుసును అమితరుచిగా తయారుచేయటానికి ఎన్నాళ్ళయినా పనికివస్తుంది," అని సిపాయి చెప్పాడు. అందరూ కలిసి సంతృప్తిగా పులుసు తాగారు.

సిపాయి సెలవు తీసుకొని పోవటానికి ముందు, ఇంటి యజమానురాలు చూపిన ఆదరణకి మెచ్చుకొని, ఆ పులుసురాయి ఆ ఇల్లాలికి ఇచ్చాడు. ఆమె వద్దని చెప్పినా వినలేదు.

"మరేమీ పరవాలేదమ్మా! తీసుకోండి! అదేమి పెద్ద ఘనమైన వస్తువుకాదు లేండి," అని, సిపాయి పులుసురాయి పోయిందనే చింతావంతా లేకుండా మళ్ళీ తన దారిని తాను పోయాడు.

మరో గ్రామం చేరేముందు దారిలో సిపాయి మళ్ళీ ఇంకొక గులకరాయి ఏరుకుని జేబులో వేసుకున్నాడు.

బెల్జియం




పులుసు రాయి




నాలుగు చిక్కు ప్రశ్నలు

# 12. నాలుగు చిక్కు ప్రశ్నలు

పూర్వం కట్టెలు కొట్టుకొని బ్రతికే ఒక పేదకాపు వుండే వాడు. అతనికి ఆస్తిపాస్తు లేమీ లేవుగాని, ఇంద్రజాలం, మంత్ర, తంత్ర శక్తులు అర్థం చేసుకోటంలోను, చిక్కు ప్రశ్నలకు తెలివిగా జవాబులు చెప్పటంలోను అంతవాడు లేడనే పేరు మాత్రం ఉండేది. ప్రజలు అతడు చేసిన పనులు, చెప్పిన విచిత్ర విషయాలు ఎంతో గౌరవంగా, కథలు కథలుగా చెప్పుకునే వాళ్లు. అతని కీర్తి ఆనోట ఆనోటా పాకి, చివరకు రాజుగారి చెవులదాకా వెళ్లింది. మొదట అతని తెలివితేటలను గురించి అంతా చెప్పుకోటం రాజు వింటూ వచ్చాడు. వినగా వినగా, రాజుకి విసుగుపుట్టింది. ఈ సంగతి తెలుసుకోవాలను కున్నాడు.

ఒకనాడు రాజు తన మంత్రుల్ని పిలిచి "ఈ కట్టెలు కొట్టుకొని జీవించే పేదకాపు, నిజంగా ప్రజలు చెప్పుకుంటూన్నంత తెలివి, చాకచక్యం ఉన్నవాడే నంటారా?" అని అడిగాడు.

"ఆ విషయం ఎవరు చెప్పగలరు ప్రభూ ? ఏలినవారే పరీక్షించి తేల్చాలి," అన్నారు మంత్రులు.

"ఆ కాపుని గురించి మీకు తెలిసిన సంగతులన్నీ నాకు చెప్పండి," అన్నాడు రాజు. అతనిని గురించి చెప్పుకోతగ్గ విశేషాలు ఎక్కువ ఏమీ లేవనీ, అతడు చాలా బీదవాడనీ, అతనికి నలుగురు కొడుకులు మాత్రం ఉన్నారనీ ఒక మంత్రి అన్నాడు.

అతనిలో ఒక్క ఎన్నతగ్గ విశేషం మాత్రం ఉందనీ, సామాన్యంగా ఎంత కఠినమైన ప్రశ్నలకైనా సులభంగా జవాబులు చెప్పగలడనీ కూడా మనవిచేశాడు. రాజుగారి ఆసక్తి హెచ్చింది.

"ఓహో! సామాన్యపు చిక్కు పశ్నలకు జవాబులు చెప్పవచ్చు సరేగాని, అసామాన్య పశ్నల సంగ తేమిటిమరి?" అన్నాడు రాజు.

వెంటనే తన రాజ్యంలో అద్భుత మంత్రశక్తిలోను, గారడీ విద్యలోను నిపుణుడైన ఒక ఫకీరుని పిలిపించాడు. అతనిని రాజు ఈ విధంగా ఆజ్ఞాపించాడు :—

"ఫకీరు మహాశయా! మన దేశంలోని ఈ కట్టెలు కొట్టుకొని బ్రతికే బీదకాపువాని తెలివిని పరీక్షించటానికి మీ సకల మంత్ర శక్తులను, ఇంద్రజాల పటిమను ప్రయోగించి కొన్ని యక్ష ప్రశ్నలు తయారు చెయ్యాలి. ఆ కట్టెలు కొట్టుకునే అబ్బాయి లోకులు చెప్పుకునేంత మహిమ గలవాడు కాకపోయిన పక్షంలో, వెంటనే అతనికి ఆటకట్టు చెయ్యాలి. నా రాజ్యంలో ఎవరిని గురించీ అబద్ధపు వదంతులు ప్రచారం కాకూడదు. అథవా మీరు ఇచ్చే చిక్కు ప్రశ్నలన్నిటికీ జవాబులు చెప్పగలిగితే, ఇక నించి అతడు పేదరికం లేకుండా, హాయిగా బతికే ఏర్పాటు చేస్తాను," అని రాజు సన్యాసితో చెప్పాడు.

ఆ మరునాడు ఫకీరు, కట్టెలు కొట్టుకొని జీవించే పేద కాపు ఉన్న ఊరికి ప్రయాణమై వెళ్లాడు. అతను సాధారణంగా అడవిలో చెట్లను నరికే చోటుకే వెళ్ళి, కంబళీ పరచుకొని కూచున్నాడు. ఆ కట్టెలు కొట్టే కాపుకోసం ఎదురుచూస్తున్నాడు.

ఆ నాడు దురదృష్టవశాత్తు, శరీరంలో ఏదో జబ్బు చేసి నందువల్ల కాపు అడవికి పోలేక, కట్టెలు కొట్టుకొని రమ్మని పెద్దకొడుకుని పంపాడు. పెద్ద కొడుకు అక్కడికి వచ్చి,

ఏదో దీర్ఘాలోచన చేస్తూ, పరధ్యానంలో కూచున్న ఆ ఫకీరుని చూశాడు. ఆ ముసలి ఫకీరుని చూసి, "అయ్యా! మీ రెవరో మహాపురుషుల్లా ఉన్నారు. ముందుముందు నాకు ఏమి రానున్నదో కాస్త దయయుంచి, జోస్యం చెప్పండి," అని అడిగాడు. "చెబుతాగాని, అయితే ముందుగా నేను నీ కొక విచిత్ర దృశ్యం చూపిస్తాను. అదేమిటో నువ్వు నాకు చెప్పాలి సుమా!" అన్నాడు సన్యాసి.

"సరేలేండి, నాకు తెలిసిన దేమిటో చెప్పటానికి ప్రయత్నిస్తాను స్వామి!" అన్నాడు ఆ కుర్రవాడు.

ఫకీరు తన ఇంద్రజాల శక్తిని ప్రయోగించి కట్టెలవాని కొడుకు కళ్ళకు ఒక విచిత్ర దృశ్యం కనిపించేటట్టు చేశాడు. ఆ కుర్రవాడికి కళ్ల ఎదుట పచ్చని పైరుతో కలకలలాడే చేను కనిపించింది. ఆ చేను చుట్టూ చిన్న కఱ్ఱలతో కట్టిన కంచె ఉంది. అలా ఆశ్చర్యంగా చూస్తుండగానే ఆ కంచె కఱ్ఱలన్నీ పంటచేను కోయటానికి పనికి వచ్చే కొడవళ్ళుగా మారిపోయాయి. అవి అమాంతంగా పైరుమీద దూకి, పైరునంతా కోసిపారేశాయి. చివరకి పచ్చని అందమైన చేనంతా పాడుపడ్డ బీడునేలగా మారిపోయింది. మళ్ళీ కన్నుమూసి కన్ను తెరిచే సరికి ఈ దృశ్యమంతా మాయమై పోయింది. మళ్ళీ యథాప్రకారంగా చుట్టూ చెట్లు, అడవి కనిపిస్తున్నాయి.

"ఈ దృశ్యానికి అర్థం చెప్పు ముందు!" అన్నాడు సన్యాసి.

"ఏం చెప్పను స్వామి? అదేదో అర్థంలేని దృశ్యం. దాని అర్థం నాకెట్లా తెలుస్తుంది?" అన్నాడు కట్టెలకాపు పెద్దకొడుకు.

"ఇక నీకు జరగబోయే సంగతి చెప్పమన్నావా? నువ్వు ఇంకొక్క క్షణంలో రాయివై పోతావు," అని చెప్పి ఫకీరు వాణ్ణి రాయిచేసి పారేశాడు.

పెద్దకొడుకు ఎంతకీ ఇంటికి రాలేదేమా అని తండ్రి చాలా దిగులు పడ్డాడు, మరునాటి ఉదయం, అన్న గతి ఏమైందో కనుక్కొని రమ్మని రెండవ కొడుకుని అడవికి పంపాడు.

రెండవ కొడుకు కూడా ముందుగా అక్కడికే వచ్చి, ఈ ఫకీరుని చూశాడు. "అయ్యా! మీరు పెద్దలు, గౌరవనీయులు, మిమ్మల్ని చూస్తే అన్నీ తెలిసినవారిలాగా ఉన్నారు. మా అన్న ఎక్కడున్నాడో, ఏమయాడో చెప్పండి స్వామి!" అన్నాడు.

"నేను నీ ప్రశ్నకు బదులు చెబుతాగాని, ముందుగా ఇప్పుడు నువ్వు చూడబోయే విచిత్రదృశ్యం అర్థం ఏమిటో నాకు చెపితే, నేను నీ కాసంగతి చెపుతాను," అన్నాడు ఫకీరు.

మళ్ళా ఫకీరు తన మంత్ర బలంచేత, ఆ అడవిమధ్య ఒక గేదె, దూడ కనిపించేట్టు చేశాడు. కాని, చిత్రంగా తల్లిపాలు దూడ తాగటానికి బదులు, దూడ గేదెకు పాలు కుడుపుతున్నట్లు కనిపించింది. మళ్ళీ ఘడియలోనే గేదె, దూడా కూడా మాయమైపోయాయి.

"ఈ దృశ్యం ప్రకృతికే విరుద్ధంగా, విపరీతంగా ఉంది. అల్లాటి యక్ష ప్రశ్నలకు అర్థం నేనేం చెప్పగలను స్వామీ!" అన్నాడు కట్టెలకాపు రెండవ కొడుకు.

"నువ్వు దీని అర్థమేమిటో చెప్పలేదు కాబట్టి నీకుకూడా నీఅన్నకి పట్టిన గతి తప్పదు," అని రెండవ కొడుకునికూడా ఇంకోరాయిగా మార్చేశాడు ఫకీరు.

మరుసటి రోజున, కట్టెల కొట్టేవాడు తన మూడవ కొడుకుని, తక్కిన ఇద్దరిగతి ఏమైందో వెంటనే చూసి రమ్మని తరిమాడు. ఎప్పటిలాగే ఫకీరు అడవిలో కూచుని ఉన్నాడు.

"ఓ మహానుభావా! దయచేసి ఈ అడవిలో కనబడ కుండా పోయిన నా అన్నలు ఎక్కడ ఉన్నారో ఏమయారో కాస్త చెప్పండి," అని సన్యాసిని వేడుకున్నాడు.

తక్కిన ఇద్దరి కొడుకులతో చెప్పినట్లే ఫకీరు మొదట్లో తాను చూపబోయే దృశ్యానికి అర్థం ఏమిటో చెప్పమన్నాడు.

తక్షణం అతని కళ్ళముందు ఒకపెద్ద బరువైన కట్టెల మోపు భుజాన మోస్తున్న ముసలివాడు కనిపించాడు. ఎంత బరువు మొయ్యగలడో అంతబరువు మోస్తూ కూడా, ఇంకా అటూ, ఇటూ పడివున్న కట్టెముక్కల్ని ఏరుకుంటూన్నాడు. అంతలోనే మళ్ళీ ఆదృశ్యం కాస్తా మాయమై పోయింది.

"నువ్వు ఇప్పుడు చూశావే ఈ చిత్రం అర్థం మేమి టోయి?" అని సన్యాసి ప్రశ్నించాడు.

"ఎవ్వరికి తెలుస్తాయి ఇట్లాటి అర్థం పర్థం లేని దృశ్యాల గొడవలు?" అన్నాడు మూడవకొడుకు.

"అట్లాగైతే నువ్వుకూడా చక్కగా మీ అన్నలదగ్గరికి చేరుకో," మని అతన్ని గూడా మూడవ రాయిగా మార్చేశాడు.

తెల్లవారింది. మూడవవాడు కూడా ఇంటికి మరలి రాక పోవటంతో తండ్రి చాలా ఆదుర్దాతో కడసారి కొడుకుని తక్కిన ముగ్గురి సంగతి నువ్వైనా తెలుసుకు రమ్మని పంపాడు.

చిన్నవాడు కూడా అడవిలో ఈ ఫకీరు దగ్గరికివచ్చి, తన ముగ్గురి అన్నల సంగతి అడిగాడు. ఫకీరు అతని కళ్ళ ముందు ఇంకొక అపురూప చిత్రాన్ని చూపించి, దాని సంగతేమిటో మొదట చెప్పమన్నాడు సన్యాసి. ఈ సారి దృశ్యంలో ఫకీరు ఒక పెద్ద కోనేరు చూపించాడు. అందులోంచి నీరంతా చిన్న, చిన్న గుంటలలోకి ప్రవహిస్తూంది. చిన్నకొడుకు ఈ చిత్రం చూస్తుండగానే కొలనులోని నీరంతా పూర్తిగా ఖాళీఅయి

పోయింది, కోనేరు ఎండిపోయింది. ఈ విచిత్ర దృశ్యం మాయమైపోగానే, దాని అర్థం ఏమిటో చెప్పమని ఫకీరు అడిగాడు. చిన్నవాడు "నాకేమి తెలియలేదు స్వామి!" అన్నాడు.

"పో! త్వరగా పో! నువ్వు కూడా నీ అన్నల్ని కలుసుకుంటానికి పో!" అని అతన్ని కూడా క్షణంలో రాయిగా మార్చి పారేశాడు ఫకీరు. ఇంకే ముంది? నలుగురు కొడుకులూ అడవిలో నాలుగు శిలలై పడి ఉన్నారు.

కడగొట్టు కుఱ్ఱాడు కూడా ఇల్లు చేరక పోయేటప్పటికి, కట్టెలకాపు అమితకలవరంతో లేచి, కాళ్ళీడ్చుకుంటూ, కొడుకుల గతి ఏమైందో కనుక్కోవాలని బయలుదేరి అడవికి వెళ్ళాడు. ఫకీరు అక్కడే కూచుని ఎదురుచూస్తూండటం చూశాడు.

"స్వామీ! మీ రెవరో అన్ని విద్యలు నేర్చిన మహాత్ముల్లాగున్నారు. నా నలుగురు కొడుకులు ఎక్కడున్నారో కాస్త తెలియజెప్పి నన్ను అనుగ్రహించండి బాబు!" అని ప్రార్థించాడు.

"రాజుగారి ఆజ్ఞానుసారం నీ కొడుకులను నా మంత్రశక్తిచేత రాళ్లను చేశాను. ఎందుకంటే, మీ కుటుంబం అపరిమితమైన తెలివితేటలు, చాకచక్యం, చమత్కారం గలదని అబద్ధపు వదంతులు బయలుదేరాయి. అందుచేత అట్లాచేశాను," అన్నాడు సన్యాసి. రాళ్ళై పడిఉన్న నలుగురు కొడుకుల్ని తండ్రికి చూపించాడు.

ఎందుకయ్యా! అభం, శుభం ఎరుగని అమాయికులైన వాళ్లని కష్టపెట్టటం? నా బిడ్డలు ఎవరినీ కష్టపెట్టి ఎరుగరు. తమ శక్తులను గురించి ఎన్నడూ ప్రగల్భాలు చెప్పి ఎరుగరే!" అన్నాడు కాపు. "ఎట్లాగైనా వాళ్లు నీ కొడుకులేగా? పైగా వాళ్లు నేను చూపించిన విచిత్ర దృశ్యాలకి అర్థం చెప్పలేకపోయారు. చెప్పగలిగివుంటే, వారిని నేను వదిలేశేవాడిని.

పోనీలే, నువ్వైనా నేను చూపబోయే అద్భుత దృశ్యాల అర్థం చెప్పగలిగితే, నీ కొడుకులు బ్రతికేట్టు చేస్తాను," అన్నాడు ఫకీరు.

"కానీండి చూద్దాం. నేను చెప్పగలుగుతానేమో ప్రయత్నించి చూస్తాను," అన్నాడు కట్టెలకాపు.

ఫకీరు మొట్టమొదట చూపిన కట్టల కంచెగల తోట మళ్లీ కనిపించేట్టు చేశాడు. కంచె కట్టలు కొడవళ్లై పైరునంతా కోసిపారేసి బీడునేలగా మార్చటం కాపు చూశాడు. ఈ దృశ్యం మాయమై పోగానే కట్టెల కొట్టేవాడు ఇట్లా అర్థం చెప్పాడు.

"జాగ్రత్తగా ఉంచమని ఒకడు ఇంకొకడికి ధనం ఇచ్చి, కొన్నాళ్లు పోయాక తాను ఇచ్చిన ధనం మళ్లీ అడిగితే తీసుకున్నవాడు, ఆ ధనం కాస్తా ఖర్చుపెట్టుకొని కాళ్లు బారజాపాడు. ఇదే ఈ చిత్రం యొక్క గూఢార్థం" అన్నాడు.

ఈ మాటలు చెవుతుండగానే ఒక రాయి మాయమై అందులోంచి కట్టెల కొట్టే కాపు పెద్దకొడుకు లేచివచ్చాడు.

రెండవసారి ఫకీరు, గేదెదూడ గేదెకు పాలిచ్చే విచిత్ర దృశ్యాన్ని చూపించాడు.

"ఇది చూస్తే నాకు సోమరిపోతైన తల్లి, తనపని అంతా కూతురిమీద తోసెయ్యటం జ్ఞాపకం వస్తూం" దన్నాడు, కట్టెలకాపు. వెంటనే రెండోరాయి మాయమై దానిలోంచి కట్టెల కాపు రెండవ కొడుకు లేచివచ్చాడు. తరువాత ముసలాడు తన వీపు మీద మొయ్యటానికి వీలులేనంత కట్టెలు మోపు మోస్తూ, ఇంకా చిన్న చిన్న కట్టెలు ఏరుకునే దృశ్యం చూపించాడు ఫకీరు.

"ఇదేముంది! ఈ చిత్రం ఎంతవున్నా ఆశకు మేర లేకుండా ఇంకా కావాలని కోరుకునేవాళ్ల దురాశను తెలియ జేస్తుంది." అన్నాడు కట్టెలకాపు. అంతలో మూడోరాయి మాయమై దానిలోంచి మూడోకొడుకు లేచివచ్చాడు.

చివరకు సన్యాసి, చివరి దృశ్యాన్ని చూపించాడు. ఒక పెద్ద కొలనులో నీరంతా చిన్న గుంటల్లోకి ప్రవహించటం, క్రమేణా పెద్దకొలనుకాస్తా ఎండిపోవటం కట్టెలకాపు చూశాడు.

"ఈ విచిత్రదృశ్యం, ప్రపంచం ఎంత దురదృష్టమైనదో తెలియజేస్తుంది. సాధారణంగా లోకంలో స్వార్థం అనేది లేకుండా తనకు గల దంతా ఇతరులకు ఇచ్చి సాయంచేసేవారికి, చివరకి ఏమీ మిగలదు. ఇదే ఈ చిత్రం అర్థం," అన్నాడు. వెంటనే నాలుగవ రాయి మాయమై దానిలోంచి నాలుగోకొడుకు లేచి వచ్చాడు. ఫకీరు సంతోషించి, "ఇప్పుడు నిజంగానే, నీకు ముందు ఏమి జరగ బోతుందో జోస్యం చెబుతా విను. నువ్వు కూడా ఈ నాలుగు విచిత్రమైన దృశ్యాలకి, అర్థం విడదీసి తగు సమాధానం చెప్పలేక పోతే ఇక్కడ మీ కట్టెల కొట్టే వాళ్ళ గొడ్డళ్ళు నూరి పదును పెట్టుకోటానికి ఐదు పెద్దరాళ్లు ఏర్పడి ఉండేవి. అయితే, నీ అదృష్టం కొద్దీ నువ్వు తెలివిగా నా యక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పావు. రాజుగారు నీలాటి తెలివి గల పౌరుడు తన రాజ్యంలో ఉన్నందుకు సంతోష పడతారు. ఇంక నీకు మునుపటి పేదరికం ఉండదు," అన్నాడు సన్యాసి.

రాజుగారు కట్టెల కాపు, ఫకీరు మంత్రశక్తిచేత కల్పించిన విచిత్ర దృశ్యాలన్నిటికి పొరపాటు లేకుండా, సవ్యంగా సమాధానాలు చెప్పాడని విని, అమితానందపడి, ఒక సంచినిండా బంగారు నాణాలు బహుమానంగా పంపాడు.

పాకిస్తాన్



ఈ పుస్తకంలో కథలు మామూలు కథలు కావు!

వేనకువేల సంవత్సరాలుగా, తరతరాలుగా, దేశదేశాల్లో మీలాంటి పిల్లలు లక్షలూ కోట్లమంది వాళ్ళ తాతయ్యల తొడమీదో, అవ్వల ఒడిలోనో కూచుని ఈ కథలు విన్నారు. విని ఆనందించారు. ఆనందించి తోటి పిల్లలకు చెప్పారు. ఆటువంటి పన్నెండు పసందైన కథలను ఈ పుస్తకం మీకు చెపుతుంది.

దక్షిణ భాషా పుస్తక సంస్థ సహకారమున ప్రకటితము.

పబ్లిషర్సు: అద్దేపలి అండ్ కో
సరస్వతీ
రాజమహే

WRAPPER PRINTED AT NEO ART

Eighth Day Books Telugu
Price: $14.50 04/12/11
Vetagadi Koduku: Selections from Ride with
Section: Foreign Language Texts/South Asian
Location: Second Floor
9 789911 696298